# పెన్నేటి కతలు

## — రామకృష్ణారెడ్డి

నర్సిమ్మారెడ్డి సేద్యెం సేస్తావుంటే నలుగురూ నిలబడి మూసేవాళ్ళంట. తలకు టువాల సుట్టి, పొల్లె పైకెగ జెక్కి, సెలకోల బుజాన యేసుకోని, ములుగర్ర సేత బట్టుకోని ఆయప్ప 'అద్దద్దా' అని ఎద్దుల్ని అదిలిస్తే, బూమితల్లి పులకరిచ్చిపోయేదంట. తెల్లవార్జామున ఆయప్పగానీ సేద్యానికి పోయినట్టు తెలిస్తే, ఏ సేనికి పోయినాడో కనుక్కోని వూళ్ళో అయిదారుగురన్నా అదేపనిగా పని సెడగొట్టుకోని ఆడికిపోయి, ఆయప్ప సేద్యెం సూస్తా కూచ్చొనేవాళ్ళంట.

మల్లా మనిసెంతుండె... పిట్టంతోడు! ఆ పిట్టంత మనిసే సేలో మడక దించి పిడికిడ్తే మేడి తోక పట్టు కున్నాడా... ఏనిగంత ఎద్దులయినా ఎగరొప్పుల్తో ఇగ్గార్సిందేనంట. పట్టుబట్టి మేడి బిగబడ్తే పిటపిటలాడి

## సేద్యెంకన్నా పద్యెం గొప్పదా?

పోయి కొమ్ములు కాడికేసి కొట్టుకొంటా ఎద్దులు నిర్సిపోవాల్సిందేనంట. సూసేవాళ్ళు ఆచ్చెరపోయి "యాడుండాదబ్బా నీకింత బలం?" అనడిగితే, పిల్లో నాల నగేవాడంట. నగి "బలం గాదురా అబ్బీ పనితనం, సేతి వాడుపు" అని సెప్పేవాడంట.


ఎండాకాలం సేద్యాలకూ, ఏరువాక సేద్యాలకూ మల్లా ఆయప్ప పోయేవాడేకాడంట. అరగొర పదును గాక మెత్తని పదునయితే మాత్రం అప్పుడు యిత్తనం గొర్రు[1] పట్టేవాడంట. ఇత్తనం అంటే గ్యాపకమొస్తాంది- ఊళ్ళో అందరూ ఇత్తనాలకు పోయేతప్పుడు ఎంత బాగుంటాదని! ఇత్తనాలకు పోయేతప్పటికి అంతకు ముందు వానలు కుర్సి ఎద్దులకూ మనుసులకూ పనులు ల్యాకపోయుంటాయిగదా, అందువల్ల ఎప్పుడెప్పుడు సేల ల్లోకి పోదామా అనుంటాది. ఆడోళ్ళు ఎద్దుల మొకాల మీద, సెండ్ల మీద కుంకం సల్లుతారు. ఇత్తనానికి పోయే మనుసుల నొసట్న బొట్టు పెడ్తారు. కాడి మీద గొర్రు బిగిచ్చినప్పుడో, సేలో గొర్రు దించినప్పుడో టెంకాయి గూడా కొడ్తారు.

ఇంటింటి ముందునా కాండ్లు గట్టుకుంటా, కోటేర్లు బిగిచ్చుకొంటా, ఇత్తనం కాళ్ళు సెనిక్కాయ పప్పుల మూటెల్ను బండ్లకెత్తుకొంటా,మీరే సేనికంటే మీరే సేనికని అడుక్కుంటా... నగుకుంటా, అంతా బలే సంబరంగా యాదో తిన్నాలకు బోతావున్నట్టో, ఇంటింట్లో పెండ్లి అయితా వున్నట్టో వుంటాదిలే. అప్పుడు సూస్తే... యాటా ఇట్టనే ఇత్తనాలు ఏస్తావుం డాము, కరువు వొస్తే పైరు ఎండిపోతా వుంది అనేది వాళ్ళకు గ్యాపకమే రానట్టు వుంటాది. ఇండ్ల ముందు ఇట్టుంటాదా, ...... ఊరిముందుకు పోయిగానీ సూస్తే అన్ని దావలా ఇత్తనం కాండ్లు సేలల్లోకి కదిలి పోతాంటాయి. కన్నావు మేర్నా ఏ సేలో సూసినా ఎద్దులూ, మనుసులూ ఇత్తనం పనీ!

నర్సిమ్మారెడ్డి గొర్రు దోలేందుకు దిగినాడంటే, ఇత్తనాల వొడి మంగల ఎంగ్రటాముడు కట్టుకోవాల్సిందే నంట. ఎంగ్రటాముడు ఏడాదంతా గడ్డాలూ నెత్తులూ గొరుగుతావుండి, నర్సిమ్మారెడ్డి ఇత్తనం గొర్రుపడ్తే తానూ నెత్తికి రుమాలు సుట్టి వొడి కట్టుకొంటాడంట. వొయిసు పిల్లోళ్ళు ఎంగ్రటాముడు నెత్తి బాగ గొరగ లేడని వద్దంటే, పెద్దోళ్ళు ఎట్టనోకట్ట గొరగమని కూచ్చొనేవాళ్ళంట. ఏదైనా నట్టం వచ్చే సంగతి సెప్ప దానికి "ఎంగ్రటామునితో నెత్తి గొరిగిచ్చుకొని పోవా ల్సిందే" అని ఇప్పటికీ అంటావుంటారు. ఊళ్ళో పెండ్లి అయ్యేటప్పుడు మేలానికి వచ్చినాడంటే... పాటా లేదంట పాడూ లేదంట, దవళ్ళు ఉబ్బిచ్చి 'ఓ...' అని ఏడ్సినట్టు బూరగ ఊదేవాడంట. అప్పుడో కేటు ఇప్పుడొకేటు డోలు మీద డబా డబామని కొట్టేవాడంట, అంతే!

అట్టాటి ఎంగ్రటాముడు ఆరుసెక్కల[2] గొర్రుకు ఒంటి జడిగెం[3] మీద రెండు సేతులా యిత్తేవాడంట! పొద్దుపొడిసిన కాన్నుంచీ పొద్దు గూకేదాంకా ఒకరు గొర్రూ ఒకరు వొడీపట్టి నర్సిమ్మారెడ్డీ, ఎంగ్రటా ముడూ ఇత్తనం యేయడం సూస్తే... కురుచ్ఛేత్రంలో కిష్నుడూ, అర్జునుడూ యిట్టనే యుద్దెం సేసినారేమో అనిపిచ్చేదంట. ఇద్దరూ ఒకర్నొకరు ఎచ్చరిచ్చుకొంటా, ఎగతాలి సేసుకొంటా వుండేవాళ్ళంట. సేలో గొర్రును ఆ గెట్టు నుంచీ ఈ గెట్టుకు ఆను పోసినట్టు నడిపిస్తానే ఒకరి పనితనం మీద యింగొకరు సవాళ్ళు జేసుకొనే వారంట. జడిగెం ఆరు సెక్కల్లో యిత్తనాలు ఒకే లెక్కన పడలేదనీ, పైరు ఒల్లెడి[4] పొర్తుందనీ అనిపిస్తే "ఎంటికెలు గొరిగేవాడు ఇత్తనాల వొడిగడ్తే అయ్యే దేనా?" అని నర్సిమ్మారెడ్డి అనేవాడంట. గొర్రు పట్టెకూ పట్టెకూ[5] నడమ గడ్డ ఎక్కువ పోతావున్నట్టు అనుమానం వస్తే "సేనంతా గడ్డలే, పోనీ నాకేం నాదా సేను? ఎన్నడెక్కని రెడ్డి గుర్రమెక్కితే ఎనకో, ముందో నంట" అని ఎంగ్రటాముడు ఎదురుదెబ్బ తీసే వాడంట.

పైరు మొల్సినాక సూస్తే ఆ గొర్రు సాల్లంత సక్కంగా కాయితం మీద గీత కూడా గీయలేరంట! కొల్తలు యేసుకొని నాట్నా అంత కచ్చితంగా మొలక మొలకకూ నడమ ఒకే మొయిన వుండేట్టు నాట్తారా, అనేట్టు వుండేదంట పైరు! ఇంగ జొన్న ఇత్తనం అయితే ఇద్దరికీ ఆట్లాటేనంట... జొన్న ఇత్తనం అయిపోతానే... ఆ సాల్ల నడమనే మల్లా గొర్రు నడిపి ఉలవ ఏసే వాళ్ళంట, గొర్రు సెక్కకూ సెక్కకూ నడమ అడుగు దూరముంటాదా, ఆ అడుగు దూరంలోనే మళ్ళా యింగో సాలేసి, యింగో పైరు ఏసేవాళ్ళంట. ఇదంతా సెప్తే తెల్దు. కండ్లతో సూసినా తెల్దు. సేద్యెం సంగతి తెల్సినోళ్ళకు తెల్సుతాది. సేలో ఇవతలి మార్న[6] గొర్రు కొమ్ము నెంబ్రరాయికి సోకుతావుండేట్టు నిలిపి, కండ్లు మూసుకుని ఎద్దుల్ని తోలి సేను అవతలి మార్న నెంబ్రరాయికి మల్లా అదే గొర్రు కొమ్ము తాకేట్టు గొర్రు తోల్నాడంట నర్సిమ్మారెడ్డి. ఒక్కోపారి ఎద్దులకు పగ్గాలు, పట్టెల్లు[7] ల్యాకుండానే తోల్నాడంట.



ఇట్ట సేద్యెంలో ఎన్నెన్నో గొప్ప పన్లు సేసినోడంట ఆయప్ప.

ఇప్పుడు ఆయప్ప సేద్యెం మానేసినాడు. ఇంటికాడ కూకొని పొద్దుపోక ఏయో పద్యాలు రాసి అచ్చేయిచ్చు కొన్నాడు. అయి రాసినందుకు ఆయప్పకు పెద్ద పేరొచ్చె. పొద్దుటూరు, కడప, ఇంగా శానా సోట్ల సబలు పెట్టి ఆయప్పకు గౌరవం సేసిరి. ఆయప్పకు గౌరవం సేసినందుకు బాదలేదుగానీ, అంత గొప్ప సేద్యెం సేస్తే రాని గౌరవం ఆరోన్ని పద్యాలు రాసినం దుకు రాడమే సిత్రం. కాయితం మీద పద్యాలు రాయడంకన్నా నోరులేని గొడ్లను పట్టుకొని నేలమీద అంత గొప్ప సేద్యెం సేయడమే ఎంతో గొప్ప. మాంచి ఏటుకాడైన ఏసోబు, ఇత్తనం కాడైన ఎంగ్రటాముడు వాళ్ళంతా గొప్పోళ్ళు గాదా! యీళ్ళను యెందుకు గౌర విచ్చరు?

పోనీ, ఆ కడప పొద్దుటూర్లలోని సదువుకొన్నోళ్ళకు సేద్యెం సంగతి తెల్దనుకొందాం, నర్సిమ్మారెడ్డికి బాగా తెల్సుగదా! ఆయప్ప గూడా యిప్పుడు తను పద్యాలు రాయడమే గొప్పనుకుంటున్నట్టుంది. అదే ఆచ్చెర్యం.

1. ఇత్తనం వేసే పనిముట్టు 2. ఆరుపాదాల 3. ఇత్తనాలను వదిలేది 4. పైరు సమంగా లేకపోవడం 5. అటు వెళ్ళి ఇటు రావడానికి 6. గట్టున 7. ఎద్దు మెడను కాడితో కలిపే తోలు పరికరం.